

పంటు సేవలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం - సఖినేటిపల్లి గ్రామాల మధ్య ప్రజా రవాణా చేసే పంటు సేవలను సోమవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో అధికారులు కొద్దిరోజుల నుంచి పంటు సేవలు నిలిపివేశారు. గోదావరికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో తిరిగి వాటి పునరుద్ధరణకు అనుమతిచ్చామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు తెలిపారు. దీంతో నిర్వాహకులు పంటు సేవలు పునరుద్ధరించారు.



గోదావరిలో పంటు

నూనెలు 'సలసల'..!



వంట నూనెలపై దిగుమతి సుంకం 20 శాతం పెంపు

లీటర్‌కు రూ.15 నుంచి రూ.20కు పెరిగిన పరిస్థితి

ప్రతి కుటుంబంపై నెలకు రూ.వందకుపైగా భారం

పామాయిల్ రైతులకు ప్రయోజనం స్వల్పమే

టన్నుకు రూ.18 వేలు మద్దతు ధర డిమాండ్ పక్కకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వంటనూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. వంటనూనెల దిగుమతులపై 20 శాతం సుంకం పెంపుతో సామాన్యులపై పెనుభారం పడే పరిస్థితి ఏర్పడింది. మోడీ సర్కార్ వచ్చిన తర్వాత గడిచిన పదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంటనూనెల ధరలు లీటర్ రూ.180 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. ఎన్నికల సమయంలో దిగుమతి సుంకం తగ్గించడంతో నూనెల ధరలు కొంతమేర తగ్గాయి. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మళ్లీ మోడీ సర్కార్ దిగుమతి సుంకాన్ని ఐదు నుంచి 20 శాతానికి పెంచింది. దీంతో వంటనూనెల ధరలు మార్కెట్‌లో విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ నూనె ధర వంద నుంచి రూ.115కు, సన్‌ఫ్లవర్ లీటర్ రూ.115 నుంచి రూ.130, వేరుశెనగ లీటర్ రూ.155 నుంచి రూ.165 ఇలా ప్రతి లీటర్ వంటనూనెపై రూ.15 నుంచి రూ.20 వరకూ ధరలు పెరిగాయి. దిగుమతి సుంకం పెంచిన వెంటనే పాత స్టాక్ ధరలూ పెంచి వ్యాపారులు వసూలు చేస్తున్నారు. పెరిగిన వంటనూనెల ధరలు చూసి సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 40 లక్షల జనాభా ఉండగా పది లక్షల వరకూ కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబం నెలకు తక్కువగా లెక్కించినా నాలుగు లీటర్ల నూనె ప్యాకెట్లను ఉపయోగిస్తారు. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై నెలకు రూ.వంద వరకూ భారం పడనుంది. ఎక్కువగా ఉపయోగించే కుటుంబాలకు ఈ భారం మరింత పెరగనుంది. గడిచిన ఎన్నికల్లో ధరల పెరుగుదల తీవ్ర ప్రభావం చూపింది. వంటగ్యాస్, కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వంటనూనెల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై జనం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ ప్రభావం కారణంగా మోడీ సర్కార్ గడిచిన ఎన్నికల్లో అత్తెసర సీట్లతో బయటపడింది. ధరల పెరుగుదల రాష్ట్రంలో వైసిపి సర్కార్‌ను సైతం కుదిపేసింది. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపుతోపాటు, కేంద్రం పరిధిలోని పప్పులు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం వైసిపిని వెంటాడింది. దీంతో రాష్ట్ర ప్రజలు మే 13న జరిగిన ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించిన పరిస్థితి తెలిసిందే. వంటనూనెలపై దిగుమతి సుంకం పెంపును కూటమిలోని టిడిపి ప్రజాప్రతినిధులు గొప్పగా చెప్పుకోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దిగుమతి సుంకం పెంపుతో వంటనూనె ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడతారనే విషయం మరిచిపోయి.. పామాయిల్ రైతులకు మేలు జరుగుతుందని కొత్త వాదన తీసుకురావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

పామాయిల్ రైతులకు మేలు ఎంత?

వంటనూనెలపై దిగుమతి సుంకం పెంపుతో పామాయిల్ పంట ధర పెరుగుతుందని, జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుందని టిడిపి ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం పెట్టి మరీ ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాలో దాదాపు లక్షా 45 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. మెట్ట ప్రాంతంలో అతిపెద్ద సాగు పామాయిల్‌నే. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పెదవేగిలో ఆయిల్‌ఫెడ్ పామాయిల్ ఫ్యాక్టరీ సైతం ఉంది. 2022 మే నెలలో టన్ను పామాయిల్ ధర రూ.23,400కు పెరిగింది. దీంతో రైతులు ఎంతగానో ఆనందించారు. పామాయిల్ ధర పెరగడంతో కౌలు నుంచి అన్ని ధరలూ పెరిగిపోయాయి. 2023, 2024ల్లో పామాయిల్ టన్ను ధర అమాంతం రూ.13,800కు పడిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా టన్ను పామాయిల్ ధర రూ.18 వేలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ పామాయిల్ రైతుల గోడును ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. వంటనూనెల దిగుమతి సుంకం 20 శాతం పెంచడంతో దేశీయ నూనె ఉత్పత్తుల ధర కొంతమేర పెరగనుంది. మన దేశానికి అత్యధికంగా నూనె దిగుమతి చేస్తున్న దేశాల్లో అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ ఉన్నాయి. దిగుమతి సుంకం పెంపుతో దేశీయ పామాయిల్‌కు టన్ను ధర రూ.16 వేలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తూ టిడిపి ప్రజాప్రతినిధులు గొప్పగా చెబుతున్నారు. వంటనూనె ధరలు పెరగడంతో రైతుల ఇబ్బందుల గురించి మాత్రం మాట్లాడటం లేదు. రైతులకు కొంతమేర ప్రయోజనం చేకూరినప్పటికీ మద్దతు ధర విషయంలో మాత్రం న్యాయం జరగలేదు. అంతర్జాతీయ మార్కెట్లో ఏవైనా మార్పులు జరిగితే మళ్లీ పామాయిల్ ధర పడిపోనుంది. అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా మద్దతు ధర రూ.18 వేలు ఇవ్వాలన్న రైతుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్నప్పుడే ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది. టిడిపి ప్రజాప్రతినిధులు పామాయిల్‌కు మద్దతు ధర వచ్చేలా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాగలిగినప్పుడే రాష్ట్రం, జిల్లాలోని పామాయిల్ రైతులకు మేలు జరుగుతుంది.

'మినీ'లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ మినీ సెంటర్లను వెంటనే మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మినీ వర్కర్ల జిల్లా సదస్సు సరళ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి సుబ్బరావమ్మ మాట్లాడుతూ మినీ సెంటర్లలో వర్కర్లు వర్కర్, హెల్పర్ రెండు పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె కాలంలో జగన్ ప్రభుత్వం వాగ్దానం చేసి మోసగించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వమైనా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవుల్లో సైతం సెలవులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. సమ్మె కాలంలో వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసి నెరవేర్చలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. సెంటర్ల నిర్వహణా భారాన్ని అంగన్వాడీల పైకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కందిపప్పు సరఫరా లేకపోవడం వల్ల అంగన్వాడీ సెంటర్లలో చాలా ఇబ్బంది పడుతున్నామని, తక్షణమే కందిపప్పు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కూరగాయల ధరలు పెరిగిపోవడం వల్ల సెంటర్లకు ఇచ్చే ఛార్జీలు ఒక మూలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సెంటర్ల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ప్రసంగించారు. యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, కె.పుష్ప, ఇందిర, మరియమ్మ, సుజాత, జ్యోతి, భూదేవి, సత్య జ్యోతి, అచ్యుత్, ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారమివ్వాలి

శ్రీ విజయదుర్గ ట్రేడర్స్‌లో ఘటనపై సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సమీపంలోని శ్రీ విజయదుర్గ ట్రేడర్స్ కంపెనీలో హైడ్రాలిక్ మిషన్ (బేల్ ప్రెస్)లో ఆదివారం చాలా అత్యంత దారుణ పరిస్థితుల్లో మృతి చెందిన బీహార్ వలస కార్మికుడు పుల్సార్ శర్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మృతుడు పుల్సార్‌శర్మ గత 15 సంవత్సరాలుగా ఈ కంపెనీలో పని చేస్తున్నాడని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. సోమవారం వారు ఇరువురు శ్రీ విజయదుర్గ ట్రేడర్స్ కంపెనీలో మృతుడు పుల్సార్‌శర్మ చనిపోయిన హైడ్రాలిక్ మిషన్ ప్రాంతాన్ని సందర్శించారు. మృతుడు చనిపోయిన తీరు చూస్తే అది ప్రమాదవశాత్తుగా జరిగినట్లు లేదని, ఉద్దేశపూర్వకంగా చంపారనే అనుమానం కలుగుతుందని వారు తెలిపారు. కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల చట్టంగాని, కార్మిక చట్టాలుగాని ఏవీ అమలు చేయడం లేదని వారు తెలిపారు. కంపెనీలో దాదాపు వంద మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారని, వారెవరికీ పిఎఫ్, ఇఎస్‌ఐ, పనిగంటలు, వారాంతపు, పండగ సెలవులు తదితర సౌకర్యాలు ఏవీ అమలు చేయడం లేదని వారు తెలిపారు. వలస కార్మికుడు మృతిపై భిన్నకోణాల్లో దర్యాప్తు జరపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు రోజున యాజమాన్యం ఎలా పని చేయిస్తుందని వారు ప్రశ్నించారు. సెలవు రోజు పని చేయించకపోయి ఉంటే వలస కార్మికుడు మృతి చెందే అవకాశం లేదని వారు తెలిపారు. ఏదేమైనా మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ఉందని, ఎలాంటి రక్షణా చర్యలు లేవని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక శాఖాధికారులు, ఫ్యాక్టరీస్ అధికారులు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఈ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న నేతలు

ఆరు హామీల్లో ఐదు అమలు

వంటనూనెలపై దిగుమతి సుంకం పెంపుతో పామాయిల్ రైతులకు మేలు


టన్ను రూ.16,500కు ధర పెరగనున్నట్లు వెల్లడి

చింతలపూడి ఎత్తిపోతలు పూర్తిచేస్తాం

ఎంపీ పుట్టా మహేష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు తాను ఇచ్చిన ఆరు హామీల్లో ఇప్పటికే ఐదు హామీలను అమలు చేశానని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకొచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తానన్నారు. వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్లు లబ్ధి చేకూరేలా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12,500 కోట్ల నిధులు కేంద్రం నుంచి వచ్చేలా తనవంతు కృషి చేశానన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరులో నిలపడం, జాబ్‌మేళా ఏర్పాటు చేసి 566 మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. వంటనూనె దిగుమతులపై సెస్ కలుపుకుని 27.5 శాతం సుంకం విధింపు ద్వారా పామాయిల్ రైతులకు టన్ను ధర రూ.16,500కు పెరగనుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. బాస్మతి రైస్, వివిధ రకాల పంటల ఎగుమతులపై 20 శాతం ఎగుమతి సుంకం విధింపు ప్రక్రియకు రెండేళ్ల సమయం పడుతుందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అహర్నిశలు కషి చేస్తున్న ఎంపీని అభినందించారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ వందరోజుల పాలనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఎంపీని అభినందించి, పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ను పామాయిల్ రైతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆచంట సూర్యనారాయణ, బొబ్బా వీరరాఘవరావు, ఉండవల్లి వెంకట్రావు, వంకినేని రామరాజు, క్రాంతికుమార్‌రెడ్డి, పెన్మెత్స రామరాజు మాట్లాడారు.



ఎంపీ, ఎంఎల్‌ఎ, నేతలకు పామాయిల్ రైతుల సత్కారం

విలేకరులను కించపరిచేలా వ్యవహారం!

ఎంపీ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు మీడియా సమావేశం అని చెప్పి 10.30 గంటల వరకూ రాలేదు. పామాయిల్ రైతులకు 10:30 గంటలకు సమావేశం అని చెప్పడంతో రైతులు సైతం ముందుగానే అక్కడకు చేరుకున్నారు. విలేకరుల సమావేశం, రైతులతో కార్యక్రమం ఒకేచోట పెట్టడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఎంపీ ఆలస్యంగా రావడంతో దాదాపు 11.30 వరకూ విలేకరుల సమావేశం జరిగింది. దీంతో అక్కడకు వచ్చిన రైతులు కొంత అసహనానికి గురయ్యారు. మీడియా ప్రతినిధులపై రుసరుసలాడారు. దీనిపై ఎంపీ కార్యాలయ సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.

నిమ్మ దిగుబడి లేక రైతుకు నష్టాలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మార్కెట్‌లో ధర ఉన్నా దిగుబడి లేక నిమ్మ రైతులు నష్టాల్లో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ద్వారకాతిరుమలలోని పంగిడిగూడెంలో సంఘం నాయకులు పర్యటించి నిమ్మ తోటలను పరిశీలించారు. నిమ్మ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కిలో నిమ్మకాయలకు రైతుకు రూ.50 నుండి రూ.70 వరకు ధర ఇస్తున్నా తోటల్లో నిమ్మకాయల దిగుబడి లేక నష్టపోతున్నారని చెప్పారు. ఎర్ర నల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల వల్ల నిమ్మకాయల దిగుబడి బాగా తగ్గిపోయిందని చెప్పారు. దిగుబడి లేని సమయంలో ధర పెంచి నెంబర్ రైతులకు మంచి ధర ఇస్తున్నట్లు చేస్తున్న ప్రచారం వల్ల రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. నిమ్మతోటల్లో తెగుళ్ల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఎరువులు, పురుగుమందులు రైతులకు సబ్సిడీపై అందించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా నిమ్మ రైతులకు నష్టాలు రావడం వల్ల తోటలు తొలగించుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిమ్మ రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. నిమ్మ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, గుర్రం పాపారావు పాల్గొన్నారు.



నిమ్మ పంటను పరిశీలిస్తున్న నేతలు

రాజకీయాల్లో అరుదైన వ్యక్తి సీతారాం ఏచూరి

సంతాప సభల్లో నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భారత రాజకీయాల్లో అరుదైన వ్యక్తి సీతారాం ఏచూరి అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. సోమవారం జీలుగుమిల్లిలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సీతారాం ఏచూరి, జిల్లా నేత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రవి మాట్లాడుతూ ఎత్తిన జెండాను దించకుండా, నమ్మిన సిద్ధాంతంతో రాజీ పడకుండా అందరి అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి ఏచూరి అని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి తెలుగు కుటుంబంలో పుట్టడం గర్వకారణంగా భావించాలన్నారు. సుందరయ్య తర్వాత జాతీయస్థాయిలో మేధావిగా సుపరిచిత వ్యక్తి ఏచూరి అని అన్నారు. విద్యార్థి దశలోనే యూనివర్సిటీ అధ్యక్షుడిగా ఎన్నికై, ఉద్యమాలు చేశారన్నారు. కమ్యూనిస్టు మేధావిగా ఉంటూనే ఇతర పార్టీల నేతలతో సత్సంబంధాలు కొనసాగించారన్నారు. సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఢిల్లీ నుంచి సీతారాం ఏచూరి ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు, రైతుసంఘం నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, సిఐటియు నాయకులు కొండలరావు, పోలవరం నిర్వాసితుల సంఘం నాయకులు గుడెల్లి వెంకట్రావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు తెల్లం వంశీ మాట్లాడారు. వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ భూమి, కూలి పోరాటాల నిర్మాత ఆర్ఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పేదల పక్షాన, కూలి పోరాటాల్లో ప్రధానంగా చించినాడ భూపోరాటాల్లో కీలక పాత్ర పోషించిన యోధుడన్నారు. కార్మికుల పక్షాన రైతు, వ్యవసాయ కార్మికులను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆర్ఎస్ మృతి వ్యవసాయ కార్మిక ఉద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి, పేదలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో టి.ముత్యాలమ్మ, యు.వెంకటేష్, ఎం.సుధారాణి, ఎ.మురళి, అందుగుల ప్రభాకర్, కారం దుర్గ, శాంతి, ముత్తమ్మ, సాయికృష్ణ, చంటి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతలు

బుట్టాయగూడెం: సీతారాం ఏచూరి సంతాప సభ మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో సిపిఎం నాయకులు కట్టం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభనుద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు, గ్రామ నాయకులు పవన్ మాట్లాడుతూ దేశం గుర్తించిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని అన్నారు. యుపిఎ-1 ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టాలు తీసుకురావడంలో కీలక భూమిక వహించారని కొనియాడారు. సిపిఎం నాయకులు పూనం దుర్గారావు, కొమరం శ్రీరాములు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో..

పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎస్‌పి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన పోలీసు కళ్యాణ మండపం వద్ద మరో పెట్రోల్ బంకు ఏర్పాటుకు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ సోమవారం శంకుస్థాపన చేశారు. పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో ఇప్పటికే ఒక పెట్రోలు బంకు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. భారత్ పెట్రోల్ బంక్ పేరుతో పోలీసు సంక్షేమ సంఘం నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మరో పెట్రోల్ బంకు ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమ కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శేఖర్, శ్రావణ్ కుమార్, శ్రీహరి, మల్లేశ్వరరావు, పవన్ కుమార్, వైవి.రమణ, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎస్‌పి

పొంగుతున్న డ్రెయిన్లు.. బలహీనంగా గట్లు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్రెయిన్లన్నీ పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు పొంగిపొర్లుతూ ఉధృతంగా ప్రవహించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోల్‌రాజ్, అన్నవరం, పెదలంక తదితర డ్రెయిన్లు పొంగిపొర్లుతూ ప్రవహిస్తుండటంతో ఆయకట్టు రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అసలే గట్లు బలహీనంగా ఉండటంతో ఎక్కడ గండిపడి వరి పొలాలు ముంపు బారిన పడతాయోననే ఆందోళన రైతుల్లో నెలకొంది. మండలవ్యాప్తంగా ఉన్న డ్రెయిన్ల గట్లు పలుచోట్ల బలహీనంగా ఉన్నాయి. కొందరు అక్రమార్కులు, మట్టి మాఫియా పలు గ్రామాల్లో డ్రెయిన్ల గట్లను తవ్వి మట్టిని బయటికి తరలించుకుపోయి మట్టి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఈ కారణంగా ప్రధాన డ్రెయిన్ల గట్లు బలహీనంగా ఉన్నాయి. ప్రస్తుతం వరద నీరు ఎగువ నుండి వచ్చి డ్రెయిన్లలో భారీగా చేరుతుంది. డ్రెయిన్లలో భారీగా వరదొచ్చి చేరడంతో ఎగువ నుంచి వచ్చే వరద నీటితో మండలవ్యాప్తంగా ఉన్న అన్ని డ్రెయిన్లు కదం తొక్కుతూ ప్రమాదకర స్థితిలో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. వర్షాలు తగ్గినప్పటికీ ఎగువన కురిసిన వర్షం అంతా ఈ డ్రెయిన్ల ద్వారానే ఉప్పుటేరులో చేరి సముద్రంలో కలుస్తుంది. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో మండలంలోని డ్రెయిన్లన్నీ పొంగిపొర్లుతున్నాయని, గట్లు బలహీనంగా ఉన్నచోట్ల పటిష్టపర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నిండుకుండలా పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్

మాంసం దుకాణాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చికెన్ మటన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒక దుకాణంలో నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ సుమారు 25 కేజీల మాంసాన్ని డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ నిల్వ ఉంచిన చికెన్, మటన్ మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కమిషనర్ పరిశీలన

క్రీడా పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న సందర్భంగా స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారని, మంచి క్రీడాస్ఫూర్తితో పోటీలను విజయవంతం చేశారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతల వివరాలు వెల్లడించి, వారిలో కొందరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛత హీ సేవ

ఏలూరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమ నిర్వహణపైన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. మండలాల్లో ఎంపిడిఒలు కార్యక్రమాన్ని పర్యవేక్షించేలా మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు నిర్దేశిత ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పవన్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం నుంచి రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీకి వెళ్లి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందని చింతలపూడి జిమ్ కోచ్ దిలీప్ అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చింతలపూడి డిఎస్‌ఎస్ జిమ్‌కు చెందిన యువకుడు పవన్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా పవన్, కోచ్ దిలీప్‌ను పలువురు అభినందించారు.

కుంగ్ ఫూతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కుంగ్ ఫూ ఎంతగానో ఉపయోగపడుతుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నూ మార్షల్ కుంగ్ - ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంగ్ - ఫూలో శిక్షణ పొంది, వివిధ విభాగాల్లో ప్రావీణ్యత కనపరిచిన విద్యార్థులకు ఎంఎల్‌ఎ బడేటి చంటి కలర్ బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కుంగ్ - ఫూ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పాల జగదీష్ బాబు, కుంగ్ ఫూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.రాజశేఖర్, మాస్టర్ జి.వి.రాఘవ, మహిళా ఇన్‌స్ట్రక్టర్ సరస్వతి రాఘవ, గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ ప్రభు, జిల్లా అధ్యక్షులు ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. చింతమనేనిని దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా తక్షణమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఇటీవల వంద రోజులు పూర్తి చేసుకుందని, గత వైసిపి పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన ఎన్నో గ్రామ సమస్యలను ఈ వంద రోజుల్లో పరిష్కరించి ప్రజలకు అండగా నిలిచామని తెలిపారు. ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన మీకోసం - మీ చింతమనేని కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని, గ్రామ సమస్యలను ప్రజా సమక్షంలోనే పరిష్కారం చూపిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), లావేటి శ్రీనివాస్, బొప్పన సుధ, నంబూరి నాగరాజు, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పంట నష్టం అంచనాలు తయారు చేసి రైతులకు నష్ట పరిహారం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆగిరిపల్లి టౌన్ శాఖ నూతన కార్యదర్శి ఎన్నిక పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగిరిపల్లి టౌన్ నూతన కార్యదర్శిగా షేక్ జహంగీర్‌బాషా, సహాయ కార్యదర్శిగా నెక్కలపు ఉత్తయ్య, సభ్యులుగా ఎం.రాజారావు, జి.కోటేశ్వరరావు, జె.గోపాలరావు,ఎస్.శ్రీనివాసరావు,జె.వెంకటేశ్వరరావు, రవి ఎన్నికయ్యారు. పేదలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం, గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం పనులను కల్పించాలని, లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలని తీర్మానించారు. అనంతరం సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివగాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో అహలే సున్నత్ జమాత్ మసీద్ కమిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సందాని, కోశాధికారి షేక్ సలీం, మహమ్మద్ బాషా, జిలానీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళపై దాడి : ఇద్దరిపై కేసు

టి.నరసాపురం :మహిళపై దాడి చేసి కొట్టి గాయపరిచిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి ఎం.రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సందిపామ లక్ష్మి ఈ నెల 13వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో తన కోడలిని తిడుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తడికమళ్ల వాసు మరోకరు తమని తిడుతున్నారని భావించి లక్ష్మిపై దాడి చేసి కొట్టి గాయపరిచారని, ఆమెను చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జీలుగుమిల్లి :మండలంలోని పి.రాజవరం సమీపంలోని డంపింగ్ యార్డ్ దగ్గర ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పి.రాజవరం సమీపంలోని వాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌పై ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా డంపింగ్ యార్డ్ సమీపంలో పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పుంజుల దొంగలపై కేసు

జీలుగుమిల్లి :మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులోని మామిడితోటలోని కోళ్ల ఫారంలో కోడి పుంజులు దొంగలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పి.అంకంపాలెం గ్రామానికి చెందిన జి.లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి కామయ్యపాలెం గ్రామ శివారులో మామిడి తోట ఉంది. అందులో కోళ్ళఫారం పెట్టుకుని మేలు రకం కోడి పుంజులను పెంచుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా 30 కోడి పుంజులు వరకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దొంగతనం చేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.


కోడి మాంసం వ్యర్థాల వాహనం పట్టివేత

భీమడోలు :అంబరుపేట రెవెన్యూ గ్రామ పరిధిలో కోడి మాంసం వ్యర్థాలను చేపల చెరువుకు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పలువురిపై కేసులను నమోదు చేసినట్లు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. కోడి మాంసం వ్యర్థాలు చేపల మేతగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు భీమడోలు పోలీసులు, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా ఒక టీమ్‌గా ఏర్పడి అంబరుపేట వద్ద తనిఖీలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో నాలుగు టన్నుల కోడి మాంసం వ్యర్థాలను ఆ ప్రాంతంలోని చేపల చెరువుకు మేతగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. విజయవాడకు చెందిన కోళ్ల పరిశ్రమ నుంచి ఈ ప్రాంతం నుంచి అంబరుపేట బొలెరో వాహనంలో కోడి మాంసం వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్నారు. పోలీసులు చేపల చెరువు యజమాని ముంగర వినాయక్‌తో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన తోకలపల్లి గ్రామానికి చెందిన బోలే వెంకటసుబ్బారావు, వాహన డ్రైవర్,వాహనంలో ఉన్న ఇతరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా స్థావరంపై దాడి

కుక్కునూరు :మండల పరిధిలోని మారేడుబాకలో సారా స్థావరాలపై కుక్కునూరు పోలీసులు దాడులు నిర్వహించారు. సిఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి మారేడుబాక గ్రామ శివారులో సారా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో మూడు లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమ చిహ్నంగా మారుతి కారు


మారుతి కారు ఆకృతిలో నిర్మించిన వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి -ముదినేపల్లి

ప్రియురాలి కోసం ప్రియుడు డాక్టర్ మనోజ్ నిర్మించిన 'ప్రేమ చిహ్నం' కథ తెలుసా... ప్రియురాలి మరణించిన తరువాత ఆమె జ్ఞాపకార్థంగా డాక్టర్ అంబుల మనోజ్ ఇంటి పైన ఈ కట్టడాన్ని నిర్మించారు. అది ఎక్కడ అంటే ముదినేపల్లిలో. ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ - మారుతి కారు ప్రేమకు చిహ్నంగా కనిపిస్తుంది. అంబుల మనోజ్, మారుతిలు కాలేజీలో చదువుకునే సమయంలో ప్రేమించుకున్నారు. పదేళ్ల నిరీక్షించిన ప్రేమ ఆ విధంగానే ఉంది. దీంతో 1992లో ముదినేపల్లి వచ్చారు. 1995లో ఇంటి స్థలం కొనుగోలు చేశారు. 1996లో రెండు అంతస్తుల బిల్డింగ్ నిర్మించారు. బిల్డింగ్ కింద భాగంలో వైద్యశాల, బిల్డింగ్‌పై భాగంలో నివాసం ఉండేలా భవనాలు నిర్మించారు.

ఆకర్షణీయంగా మారుతి కారు

ఈ నిర్మాణాలకు పైభాగంలో మారుతి ఆకారంలో వాటర్ ట్యాంక్ 2000 సంవత్సరంలో తన ప్రియురాలు ప్రేమకు చిహ్నంగా మారుతి కారు ఆకృతిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. చూపరులను ఆ చిహ్నం ఆకట్టుకుంటుంది. నిజమైన కారు ఇంటిపైకి ఎలా ఎక్కిందా సందేహం స్థానికుల్లో కలిగేలా చేసి అబ్బురపరిచేలా నిర్మాణాలు చేశారు. డాక్టర్ అంబుల మనోజ్ ప్రస్తుతం వైద్యులుగా పేద ప్రజలకు తన వంతు సహకారం అందిస్తున్నారు. పలు గ్రామాల్లో ఆలయ నిర్మాణాలు చేస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు.

ప్రేమ చిహ్నం మారుతి కారు

డాక్టర్ అంబుల మనోజ్ ఈ ప్రేమ చిహ్నం విషయం గురించి ప్రజాశక్తికి వివరించారు. తమ ఇంటికి ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలనే ఆలోచనతో ప్రియురాలి పేరున మారుతి ఆకారంలో ఈ కళాఖండాన్ని ఇంటిపై నిర్మించాను. ఫలానా వారి ఇల్లు ఎక్కడ అనగానే ఇంటిపై కారు ఉందని చెప్పేలా ఖర్చు ఎక్కువైనా ఈ ఆకృతిలో నీటి ట్యాంకును ఏర్పాటు చేశానని తెలిపారు. వర్షానికి తడిచి, ఎండకు ఎండటంతో కొంత మేర రంగు వెలిచిపోవడంతో ఏయేటికాయేడు రంగులను వేస్తూ వాటి అందాన్ని కాపాడుతున్నానని తెలిపారు.

నేటి నుంచి 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో గ్రామపంచాయతీ పరిధిలో జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల పర్యవేక్షణ నిమిత్తం గ్రామ స్థాయి నోడల్ అధికారులను నియమిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ పనిముట్లు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి కొర్లగుంట గ్రామ నాయకులు సేవా దృక్పథంతో అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం పనిము ట్లను అందించారు. మండలంలోని కొర్లకుంట శివారు అప్పారావుపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సర్వీసు ఉన్నప్పటికీ ఆ కేంద్రంలో ఉన్న లైట్లు, వైర్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు పనిచేయడంలేదు. నిరుపయోగంగా ఉన్న కేంద్రానికి విద్యుత్ సౌకర్యం పనిముట్లను టిడిపి గ్రామ నాయకులు పొట్లూరి మహేంద్రవర్మ, లక్ష్మీప్రసన్న ఇరువురు కలిసి తమ సొంత నిధులు ఖర్చుపెట్టి కొనుగోలు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ శివ నాగేంద్ర, గోళ్ల వెంకటరామయ్య, పొట్లూరి వాసుదేవరావు, రంగారావు పాల్గొన్నారు.

ఆశ్చర్య పాఠశాల పూర్వ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముసునూరు

నిరుపేద కుటుంబ నేపథ్యంలో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థుల ఔన్నత్యం తమ పాఠశాలకే దక్కుతుందని లోపూడి ఆశ్చర్య విద్యాలయ ప్రిన్సిపల్ వరికూటి ప్రతాప్ తెలిపారు. ఐదో తరగతి వరకు లోపూడి ఆశ్చర్య విద్యాలయంలో ప్రాథమిక విద్యనభ్యసించి, జవహర్ నవోదయ-కృష్ణా విద్యాలయంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఇప్పుడు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లు సాధించారన్నారు. సాక్షి ముసునూరు మండల విలేకరి వరికూటి వెంకట కుమార్ కుమారుడు వరికూటి ఆదర్శ్ కుమార్‌కు, చాట్రాయి మండలం తుమ్మగూడేనికి చెందిన ఆర్‌టిసి కండక్టర్ కొండా శ్యామ్ కుమార్తె సుమాంజలికి సీట్లు రావడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. తమ పాఠశాల తరపున ఆ ఇరువురును అభినందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు శుభ అభినందనలు తెలిపారు.

వికలాంగురాలిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నరసాపురంలో వికలాంగురాలు నిర్మలపై దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవా ధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ప్రకటన విడుదల చేశారు. వికలాంగురాలిపై దాడి చేసిన వారు ఎంతటి వారైనప్పటికీ వారిని 2016 వికలాంగుల చట్టం సెక్షన్ 92ఎ ప్రకారం ప్రభుత్వం కఠినంగా శిక్షించి వికలాంగురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తపేటలో అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం మండల కేంద్ర ప్రధాన రహదారుల్లో భారీ గణపతి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం పంచాయతీ కొత్త పట్టిసీమ గాంధీ బొమ్మ వీధి విగ్రహం, గూటాల రామాలయం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహాల, ఊరేగింపులు, నూతనగూడెం భారీ గణపతి విగ్రహాన్ని ప్రధాన రహదారుల్లో తీన్‌మార్ వాయిద్యాలు డిజె సౌండ్ బాక్సులతో ఊరేగించారు. కొత్తపేట గ్రామంలో వినాయకుని ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

కూరగాయలు.. కొనాలంటే ధరలు..!

వరదల నేపథ్యంలో తగ్గిన దిగుబడి
ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు
సామాన్యులకు మరింత భారం



ప్రజాశక్తి - కుక్కునూరు

వర్షాలు తగ్గాయి... వరదలు తగ్గాయి... కాని సామాన్యుడికి కష్టాలు పెరిగాయి. వరద నష్టం కూరగా యలపై పడింది. దీంతో మరోసారి కూరగాయల ధరలు కొండెక్కాయి. సామాన్యులు కొనే పరిస్థితి లేకుండా పోతోం ది. భారీ వర్షాల కారణంగా చాలా చోట్ల పంట నష్టపో వటంతో దిగుబడి తగ్గింది. దీంతో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దాదాపు అన్ని రకాల కూరగా యల ధరలు సెంచరీకి చేరువయ్యాయి. ఈ సీజన్‌లో అంద రికీ అందుబాటులో ఉండే కూరగాయలు, ఆకుకూరల ధర లు భారీ వర్షాలు కారణంగా పెరిగిపోయాయి. ము న్ముం దు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారు లు చెబు తున్నారు. కొన్ని జిల్లాల్లో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. దీంతో కూరగాయల సాగు దెబ్బ తీసింది. గణనీయంగా కూరగాయల దిగుబడి తగ్గింది. చా లా చోట్ల కూరగాయల తోటలు మునిగిపో యాయి. మరికొన్నిచోట్ల వరదలకు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో అన్ని రకాల కూరగాయల ధరలు 40 శాతం వరకు పెరిగాయి. టమాటాలు రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతుం డగా పచ్చిమిర్చి కిలోకు రూ.70, చిక్కుడు కిలో రూ.100, బీరకాయ రూ.80, ఆకు కూరలు కట్ట రూ.20, కొత్తిమీర, పుదీనా కట్ట రూ.50 నుంచి రూ.100 పలుకుతుంది. గతంలో రూ.300 కొనుగోలు చేస్తే వారానికి సరిపడా వచ్చేవి. ఇప్పుడు కనీసం రెండు రోజులకు సరిపోయే కూరగాయలు రావటం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిగడ్డలు రూ.60 నుంచి రూ.70 పలుకుతున్నాయి. ఈ ధరలు కొత్త పంటలు వచ్చే వరకు కంటిన్యూ అవుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఓజోన్ పొరను సంరక్షించాలి

ప్రజాశక్తి - మండవల్లి

మానవ జీవన వైవిధ్యానికి రక్షణతోపాటు సమస్త జీవరాసుల మనుగడ ఓజోన్ పొరతోనే సాధ్యమని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ స్పష్టం చేశారు. సోమవారం అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లి ఇండియన్ బ్యాంక్ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపైన సుమారు 25 కిలోమీటర్ల ఎత్తులో ఓజోన్ పొర ఉంటుందని, అది సూర్యుడు నుంచి వచ్చే హానికరమైన అతిలోహిత కిరణాలను నేరుగా భూమికి తాకనీయకుండా రక్షణగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఓజోన్ పొర ఆవశ్యకతను తెలుసుకొని విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టెంటు అప్పారావు, సిహెచ్‌వి.రామారావు, తోట శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రెహనా పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

మహమ్మద్ ప్రవక్త సమస్త మానవాళికి మార్గ దర్శకులు అని రాష్ట్ర జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ అన్నారు. దేశ సమైక్యత, స్వేచ్ఛా సమానత్వం, మహిళలకు హక్కులు, ఆర్థిక పురోగతి వంటి వాటివి మహ్మద్ ప్రవక్త భోధనల్లో సూచనలుగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు చేయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ నియమించిందని, ఇది కేవలం మత పరమైన రాజకీయం చేయడం కోసం జరుగుతున్న ప్రయత్నమని రఫీక్ అన్నారు. అసలు వక్ఫ్ అంటే ముస్లిమ్‌ల పూర్వీకులు కష్టపడి సంపాదించిన ఆస్తులను దైవ మార్గంలో అప్పజెప్పడమన్నారు. ఆ ఆస్తులను కాపాడటం కోసం వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేశారని, వక్ఫ్ ఆస్తులు అంటే పూర్వీకులు సంపాదించిన స్థలాలు, పొలాలు ఉంటాయని, వాటిని పరిరక్షించడం మాత్రమే వక్ఫ్ బోర్డు విధి అని, ఇందులో ప్రభుత్వానికి అజమాయిషీ లేదని రఫీక్ అన్నారు. వక్ఫ్ బోర్డు వలల దేశ సంపదకు, సమైక్యతకు ఎటువంటి నష్టం వాటిల్లదని, కావాలనే మత విద్వేషాలు రెచ్చ గొట్టేందుకే ఇలాంటి సవరణ బిల్లు ప్రవేశ పెట్టారని తెలిపారు.

స్టేట్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో ఘర్షణ

రెండు గ్రూపుల పరస్పర దాడి
ఒక వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్టేట్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ పేరుతో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలు చర్చనీయాంశంగా మారాయి. పోటీలకు వచ్చిన వారు తమలో తాము కొట్టుకోవడంతో ఏలూరు రెడ్డి కళాశాలలో పెద్దఎత్తున ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏలూరు నగరంలోని సర్ సిఆర్.రెడ్డి కళాశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం స్టేట్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ మిస్టర్ ఆంధ్ర పేరుతో నగరానికి చెందిన జిమ్ నిర్వాహకుడు రఘు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు ఏలూరు నగరం నుంచే కాకుండా రాజమండ్రి, తాడేపల్లిగూడెం ప్రాంతాల నుంచి కూడా బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. ఏలూరు నగరంలోని వట్లూరు కొత్తపేట ప్రాంతాలకు చెందిన ఇరు గ్రూపులు ఈ మిస్టర్ ఆంధ్ర షీల్డ్ కోసం పోటీ పడ్డాయి. తాము గెలిస్తే వేరే ఒకరికి కట్టబెడుతున్నారని ఒక గ్రూపు, తాము ఈ షీల్డ్‌ను కైవసం చేసుకున్నామని మరో గ్రూపు వాగ్వివాదానికి దిగి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వట్లూరు ప్రాంతానికి చెందిన కర్రి కిరణ్‌కుమార్ అనే వ్యక్తి గాయాల పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని ఎవరిని బయటికి పంపకుండా సిఆర్.రెడ్డి కళాశాల గేట్లు మూసివేశారు. అనంతరం వారి పేర్లను నమోదు చేసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపివేశారు. దాదాపు పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గాయాలపాలైన కిరణ్ అస్వస్థతకు గురి కావడంతో వెంటనే అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను ఆదివారం అర్ధరాత్రి ఆసుపత్రి నుంచి పరారయ్యాడు. ఈ పోటీల నిర్వాహకుడు రఘును పోలీసులు ఈ విషయంపై ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు గ్రూపుల వారు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులకు పాల్పడడం నగరంలో చర్చనీయాంశమైంది. నిర్వాహకుడు రఘుపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

చెరువు ఆక్రమణ.. రైతుల ఆవేదన

చర్యలు తీసుకోవాలని వేడుకోలు
స్పందించని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల మధ్య శ్రీ మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం పక్కన ఉన్న చెరువు ఆక్రమణకు గురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 23.45 ఎకరాలకు 8.45 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని వాపోతున్నారు. సర్వే నెంబర్ 101/1లో 1.06 ఎకరాలు, 101/3లో 0.89, 101/4లో 0.62, 101/5లో 0.58, 101/6లో 2.30, 101/7లో 0.32, 103/1లో 0.17, 103/2లో 0.87, 103/3 సర్వే నెంబర్‌లో 0.98 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని వారు చెబుతున్నారు. సర్వే నెంబర్ 101/2లో 15.63 ఎకరాలు మాత్రమే భూమి మిగిలి ఉందని చెబుతున్నారు. చెరువు గట్లు ధ్వంసం చేసి పంట పొలాలుగా మారుస్తున్నారని వాపోతున్నారు. పొంగుటూరు మెయిన్ రోడ్డు నుంచి కొయ్యలగూడెం వెళ్లే రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంకు తూర్పు రోడ్డు వైపు నుంచి చెరువు వరకు 25 నుంచి 30 మీటర్లు వెడల్పు దాదాపు 2.5 కిలోమీటర్లు పంట పొలాలకు వెళ్లే రహదారి మచ్చుకైనా కనపడకుండా కబ్జా చేశారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారి లేకపోవడంతో ఇతర రైతుల పొలం నుంచి వెళ్లాల్సి వస్తుంది. సయోధ్యగా ఉనప్పుడు బాగానే ఉన్నా ఏమైన గొడవలు జరిగితే రైతులు వ్యవసాయం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంట పొలాల్లో కి చెరువులో నీరు

8.45 ఎకరాలు ఆక్రమణకు గురవ్వడంతో



ఆక్రమణకు గురైన చెరువు ఇదే...

చెరువు గట్టు తెంపుకుని వ్యవసాయం చేయడంతో ఆ నీరు ఆక్రమణ పరిధిలో లేని రైతుల వ్యవసాయ పంట పొలాలకు వస్తుంది. దీంతో నష్టం వాటిల్లుతుందిన రైతులు వాపోతున్నారు. చిన్న వర్షం కురిసినా చెరువు నిండి దిగువకు నీరు వెళ్లడంతో ఆ దిగువున ఉన్న పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

గతంలో చాలా సార్లు రైతులు మండలాధికారులకు ఫిర్యాదు చేసినా మధ్యలో పెద్దలుగా చెలామణి అయ్యే వ్యక్తులు అడ్డుకుంటూ వచ్చారని, ఆక్రమణ దారులను కాపాడుకుంటూ వచ్చారని రైతులు చెబుతున్నారు. మొన్న కురిసిన భారీ వర్షాలకు చెరువు తెగి అన్ని వైపులా పంట పొలాలు నీట మునగడంతో రైతులు నష్టపోయారు. ఈ ఆక్రమణను ఎలాగైనా అడ్డుకుంటామని సన్న, చిన్న కారు రైతులు చెబుతున్నారు. ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యకు పరిష్కారం చూపాలి
పసుపులేటి రాజు, రైతు




దాదాపుగా 2.5 కిలో మీటర్ల రోడ్డు కబ్జాకు గురైంది. ఆ దారి లేకపోవడంతో ఇతరుల పొలాల మీదుగా మా పొలాలకు ధాన్యాన్ని తీసుకెళ్లడానికి ఒక సాహసమే చేయాలి. దయచేసి మాకు పరిష్కారం చూపాలి.

తూర్పు పుంత రహదారి నిర్మించాలి
నులకాల శ్రీను



మా పెద్దలు దగ్గర నుంచి ఇక్కడ భూమి ఉంది. నా పొలంలో కూడా కొంత చెరువు భూమి ఉంది. అది నేను ఇవ్వడానికి సిద్ధం. సత్వరమే నేను వదులుకుంటా. కాని పుంత దారి లేదు.మొత్తం ధ్వంసం చేశారు. తూర్పు పుంత రహదారి నిర్మాణం చేపట్టాలి. అప్పుడు ఆక్రమణదారులు కూడా ముందుకు వస్తారని నా అభిప్రాయం.

అధికారులు, నాయకులు స్పందించాలి
అడపా సూర్యారావు



అసలు ఈ చెరువు నా పొలం దగ్గరలో లేదు. కాని చిన్న వర్షం కురిసినా నా పంట మొత్తం నాశనం అవు తుంది. వర్షాలు కురిస్తే దిగవకు నీరు వస్తుంది. లోతట్టు పొలాలు కావడంతో, నా పంట మొత్తం నీట మునుగుతుంది. అధికారులు, నాయకులు స్పందించాలి.

వందనకు పలువురి అభినందన

చింతలపూడి :2024 నిట్ ఫలితాల్లో మెడిసిన్‌లో చింతలపూడి మండలానికి చెందిన వందన 584 మార్కులు సాధించింది. బిసి-సి కేటగిరిలో కెఎటిఆర్ కాలేజీ, గుంటూరులో అడ్మిషన్ పొందింది. ఈ సందర్భంగా వందను, ఆమె తల్లిదండ్రులను పలువురు అభినందించారు.